కానరాని పబ్లిక్ టాయిలెట్లు

- ఖాళీ స్థలాల వైపు పరుగులు
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో ప్రజామరుగుదొడ్లు లేక చిరు వ్యాపారులు, దుకాణాల్లో పని చేసేవారు, వివిధ పనులపై జిల్లాకు వచ్చిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. స్వేచ్ఛత పాటించాలని చెబుతున్న ప్రభుత్వాలు, అధికారులు జిల్లా కేంద్రంలో ఎక్కడా మూత్రశాలలు, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఖాళీ స్థలాల వైపు పరుగులు పెడుతున్నారు. కాగా మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా.. నేటి వరకు ఒక పబ్లిక్ టాయిలెట్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

తప్పని తిప్పలు..

మండలం నుంచి జిల్లాగా మారడంతో జిల్లాకు ఏదో ఒక పనిపై నిత్య వందలాది మంది జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కాని ప్రజా టాయిలెట్లు నేటి వరకు నిర్మించక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా కేంద్రంలో ప్రధాన చౌక్‌లు వివేకానంద చౌక్, గాంధీ చౌక్, పోట్టి శ్రీరాంచౌక్, అంబేద్కర్ చౌక్‌లో అనేక వ్యాపార సముదాయాలు, కిరణాలు, రకరకాల దుకాణాలు కలిపి మొత్తం 420 వరకు ఉన్నాయి. ఆయా షాపుల్లో సుమారు 570 వరకు పని చేస్తుంటారు. దానితో పాటు వివిధ పనుల నేపథ్యంలో తిర్యాణి, కెరమెరి, వాంకిడి, రెబ్బెన, జైనూర్‌తో శనివారం బజారు ఉండడంతో వేరే ప్రాంతాల నుంచి వ్యాపార నిమిత్తం చాలా వివిధ మండలాల నుంచి వేలాది మంది జిల్లా కేంద్రానికి వస్తుంటారు. కానీ వీరందరు ఒంటికి, రెంటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే పని కనిస్తున్నారు. కానీ స్త్రీలు మాత్రం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎక్కడ ఉన్న బస్టాండ్‌లో మురుగుదొడ్లకు పరుగు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కనీసం మూత్రశాలలు ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.


జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడలి

టాయిలెట్లు ఏర్పాటు చేయాలి..



జిల్లా కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు లేక ఆయా షాపుల్లో పని చేసే సిబ్బందికి అనేక ఇబ్బంది పడుపడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రధాన కూడళ్లలో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి.

– సత్తయ్య, షాప్ యజమాని

ఇబ్బంది పడుతున్నాం



పట్టణంలో పబ్లిక్ టాయిలెట్లు లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లలో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. బస్‌స్టేషన్‌లో తప్పా పట్టణంలో ఎక్కడ లేక పోవడంతో తిప్పలు తప్పడం లేదు.

– బాలాజీ, ఆసిఫాబాద్

మెరుగైన విద్యనందించాలి


నూతన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, సిర్పూర్(టి) మండలాల్లోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. బాధ్యతయుతంగా విధులు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ మార్త రమేశ్, ఎర్మ జలపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం జయప్రదం చేయండి

ఆసిఫాబాద్‌రూరల్: పద్మశాలిల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అంజనేయులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20 హైదరాబాద్‌లో ఎల్బీనగర్ హరిణి వనస్థలి నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, లింగయ్య, సురేశ్, రమేశ్, ధర్మయ్య, శ్రీకాంత్, చందు, వెంకన్న, పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్లు...


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన నామినేషన్లు శుక్రవారం ముగిశాయి. అధ్యక్ష పదవి కోసం శ్రీకాంత్, లింగయ్యలు, ప్రధాన కార్యదర్శికి సంజీవ్, అల్లే శ్రీకాంత్ రెండు నామినేషన్లు దాఖలు చేసినట్లు కమిటి సభ్యులు ప్రకాశ్, మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వి నియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధాప్య పెన్షన్ మంజూరు


పెన్షన్ మంజూరు కాపీ అందజేస్తున్న ఎంపీడీవో

దహెగాం: మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన పెన్షన్ కాపీలను అందజేసినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. మండలంలోని లగ్గాంలో ఇద్దరు, ఒడ్డుగూడలో ఇద్దరు. మండల కేంద్రానికి చెందిన ఒకరికి వృద్ధప్య పెన్షన్‌లు మంజూరైనట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పెన్షన్ కాపీలను వారికి అందించామన్నారు. ఆయన వెంట సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి బాపు గత ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను మాజీ సర్పంచ్ జాజిమొగ్గ శ్రీనివాస్ పరామర్శించి, రూ.5వేలు ఆర్థికసాయం చేశారు. బాధిత కుటుంబానికి అన్నివేళాల అండగా ఉంటామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామానికి చెందిన సాధు విజయకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.28500 చెక్కును శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్ అందచేశారు. ఆయన వెంట నాయకులు గణపురం నగేశ్, గణపురం వెంకన్న, జునుగరి ప్రభాకర్, చిలువేరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి


టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల: గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గురుడుపేట గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా టీకాల కార్యక్ర మం చేపడుతుందన్నారు. నాలుగు నెలల వయస్సు పైబడిన పశువులకు టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సందీప్, భిక్షపతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులు

కౌటాల: కౌటాల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఎస్‌వో పవిత్ర తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో విద్యార్థులు గ్రూప్ డాన్స్‌లో ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థినులు ఆర్. పౌర్ణమి, పి. కావేరి, డి. అలేఖ్య, పి. గంగా, సాయిప్రియలను పీఈటీ సీహెచ్ సౌందర్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వరికి అగ్గి తెగులు


దహెగాం శివారులో అగ్గి తెగులు సోకిన వరి పంట

- దిగుబడిపై ప్రభావం

దహెగాం: ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేసిన రైతులకు ఏటా నష్టాలే మిగుతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతూనే ఉన్నారు. చివరికి తెగుళ్ల సోకడంతో దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. మండలంలో సుమారు 6 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వరి సాగు బాగానే ఉన్నప్పటికీ తెగుళ్లలతో రైతులు సతమతమవుతున్నారు. అగ్గి తెగుళ్ల సోకడంతో వరి ఎండి పోతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి చేతికి వస్తుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. వరి కోసలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు వరి పా లాలు సందర్శించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

వాంకిడి: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు అవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఉచిత ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆల్‌ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డికి మద్దతుగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకుడు బొట్టుపల్లి సాయికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, అధ్యాపకులు విలాస్, మల్లేశం, స్వామి, రామ్‌చందర్, కవిత, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రణయ్ కుమార్

జైనూర్‌లో ఇంటర్నెట్ పునరుద్ధరించాలి

ఆసిఫాబాద్: జైనూర్ మండలంలో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు గేడం టీకానంద్, ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జైనూర్‌లో జరిగిన ఘర్షణల అనంతరం ఏజెన్సీ మండలాలు జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ), వాంకిడి, కెరమెరి మండలాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయని తెలిపారు. జైనూర్‌లో ఇప్పటికీ ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించకపోవడంతో డిజిటల్ లావాదేవీలు నిలిచిపోగా.. విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. రేషన్ బియ్యం, ఆసరా పింఛన్ల పంపిణీ, తదితర ఇంటర్నెట్ ఆధారిత సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, సహాయ కార్యదర్శులు సతీశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్తీక్

వైభవంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కలశ ఆవిష్కరణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. గోద్మోలే భీంరావ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. పట్నాపూర్ సిద్దేశ్వర పూలాజీబాబా సంస్థన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవ్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. నాయకులు కుడే కైలాస్, ముఖడే విష్ణు, కరాడే మారుతి, రాందాస్, ముఖడే ఉత్తం, ధన్‌జీ, పుంజరాం, కాలే గణపతి పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు

మహిళ అదృశ్యం

రెబ్బెన: మండలంలోని జక్కులపెల్లి గ్రామానికి చెందిన మండల రజిత అనే మహిళ ఈనెల 12వ తేదీ నుంచి కనిపించటం లేదని రెబ్బెన ఎస్సై డి. చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న మంచిర్యాల జిల్లా ఐబీ తాండూర్ వారసంతకు వెళ్తున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుంటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలిసిన వారు రెబ్బెన పోలీస్‌స్టేషన్‌కు 87126 70532 సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రామాల్లో 'భగీరథ' కష్టాలు..!

- తాగునీరు సరఫరా కాక ప్రజల ఇబ్బంది
- పట్టించుకోని మిషన్ భగీరథ అధికారులు


నీటిని తెచ్చుకునేందుకు వెళ్తున్న మహిళలు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సిర్పూర్(టి) మేజరు గ్రామ పంచాయతీ పరిధిలోని పలుకాలనీల్లో భగీరథ కష్టాలు వెంటడుతున్నాయి. నెల రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం దూర ప్రాంతాలను వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని చేతిపంపు, బావుల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని వాపోతున్నారు. సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అదే విధంగా మండలంలోని డోర్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొమ్ముగూడ గ్రామంలో సైతం మిషన్ భగీరథ నీరు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సమీప గ్రామమైన డోర్‌పల్లి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. లేదంటే ముత్తంపేట గ్రామం నుంచి ప్రైవేటు వాటల్ ప్లాంట్‌ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. అదే విధంగా మండలంలోని హుడ్కిలి గ్రామంలో ఇప్పటి వరకు గ్రామంలో కొంత మందికి మిషన్ భగీరథ కనెక్షన్లు ఇవ్వలేదు. మండలంలోని ఇటిక్యాల పహాడ్ గ్రామంలో వాటర్ ట్యాంక్ వరకు మిషన్ భగీరథ కనెక్షను ఇచ్చినా నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. ఇటిక్యాల పహాడ్‌లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో చేతిపంపుల నీటిని తాగుతున్నారు. భగీరథ అధికారులు స్పందించి తాగునీటి సమస్యలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.


ఎడ్లబండిపై డ్రమ్ములతో నీటిని తీసుకెళ్తున్న కొమ్ముగూడ గ్రామస్తులు

తాగునీటి ఇబ్బందులు



కాలనీలో సుమారుగా నెల రోజులకుపైగా తాగునీటి సమస్యతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ రోజు తాగు నీటి కోసం నానా తంటాలు పడి నీటిని తెచ్చుకుంటున్నాం. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా తాగునీరు సరఫరా చేయాలి.

– జడల శాంతమ్మ, సిర్పూర్(టి) ఎస్సీ కాలనీ

అధికారులు స్పందించాలి



నెలరోజులకు పైగా కాలనీలో తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు మాత్రం ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. సమస్యలను గుర్తించి కాలనీలకు తాగునీరు సరఫరా చేయాలి. అధికారులు తక్షణమే స్పందించాలి.

– మేకల ఎల్లమ్మ, సిర్పూర్(టి) ఎస్సీకాలనీ

సమస్య పరిష్కరిస్తాం

గ్రామాల్లోని మిషన్ భగీరథ నీటి సమస్యలను పరిష్కరిస్తాం. సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని కాలనీల్లో పైపులైన్ బ్లాక్ కావడంతో సరఫరా కావడం లేదు. కంచర్‌పేట గ్రామ సమీపంలో పైపులైన్ లీకేజీతో కొమ్ముగూడ గ్రామానికి నీటి సరఫరా సమస్యలు వచ్చింది. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

– పృథ్వీరాజ్, మిషన్ భగీరథ డీఈ

కుమురం భీంకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న గిరిజన నాయకులు

సిరికొండ: మండల కేంద్రంలో తుడుందెబ్బ, గిరిజన నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఘన నివాళులర్పించారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్‌లో భీం చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన గిరిజన జాతి కోసం చేసిన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే భోజన సదుపాయం కల్పించాలి

రెబ్బెన: ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో పాత పద్ధతిలోనే ఉద్యోగులకు భోజన సదుపాయం కల్పించాలని ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్‌లు కోరారు. శుక్రవారం ఓసీపీ యాక్టింగ్ మేనేజర్ నారాయణతో కార్మిక సమస్యలపై గుర్తింపు సంఘం నాయకులు సమావేశమయ్యారు. కై రిగూడ క్యాంటీన్‌ను కాంట్రాక్టర్ నిర్వహించిన సమయంలో ఉద్యోగులకు భోజన సమయంలో కర్రీ, ఫ్రై కర్రీ, పప్పు, సాంబార్, రసం, మజ్జిగ, పాపడ్ అందించేవారని నాలుగు నెలల క్రితం క్యాంటీన్ నిర్వహణ నుంచి కాంట్రాక్టర్ తప్పుకోవడంతో సింగరేణి యాజమాన్యమే నడుపుతుందన్నారు. కేవలం కూర, పప్పు, సాంబార్ మాత్రమే ఇస్తున్నారని అన్నారు. పాత పద్ధతిలోనే భోజన సదుపాయం కల్పించాలని మేనేజర్‌ను కోరారు. అలాగే కార్మికుల పర్సనల్ రికార్డు ఈపీఆర్‌లో ఫ్యామిలీ ఫొటోలు అప్‌డేట్ చేయగా ఫొటోలు మారిపోయాయని వాటిని వెంటనే సరిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శులు శేష శయన రావు, జూపాక రాజేష్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, దివాకర్, సహాయ కార్యదర్శి ఓదెలు, వెంకటేశ్, అంజయ్య పాల్గొన్నారు.


కార్మిక సమస్యలపై మేనేజర్‌తో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మహిళలకు చీరలు పంపిణీ

బెజ్జూర్: మండల కేంద్రంలో ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకు మత్స్యకారుల కుల దైవం గంగామాతాను ప్రతిష్ఠించనున్నారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపడుతారు. ప్రాణహిత నదిలో నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం మత్స్యకార మహిళలకు కుల పెద్దలు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సూర్ల ఇస్తారి, కులపెద్దలు గుమ్ముల బాలయ్య, పాకాల బిచ్చయ్య, గాండ్ల వాగయ్య, మత్స్యకారులు మంచెర్ల శ్రీకాంత్, ఎల్లెల పోషయ్య పాల్గొన్నారు.


చీరలు అందజేస్తున్న కుల పెద్దలు